క్లుప్తంగా

సహకార సంఘాల ఇన్‌చార్జిగా అలంకార్



గుడివాడ టౌన్: గుడివాడ డివిజన్ సహకార సంఘాల విభాగం ఇన్‌చార్జి అధికారిగా దాసరి అలంకార్ నియమితులయ్యారు. సోమవారం స్థానిక జగన్నాథపురం పాటిమీద గల కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ డీఆర్‌గా పనిచేస్తున్న ఆయన డివిజన్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించడాన్ని పలువురు అభినందించారు. వల్లూరిపాలెం, దేవరపల్లి, బద్రిరాజుపాలెం సహకార సంఘాల సీఈఓలు ఆయనకు అభినందనలు తెలిపారు.

అగ్నిమాపక కేంద్రం పరిశీలన



గుడివాడ టౌన్: అగ్నిమాపక కేంద్రం సేవలు అభినందనీయం అని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. అగ్నిమాపక నియంత్రణలో ఉపయోగించే అన్ని రకాల పరికరాలు, యంత్ర సామగ్రి, ఉపకరణాలను పరిశీలించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అధికారులు, సిబ్బంది చేసిన సేవలను ఆయన అభినందించారు. ప్రజలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

మోటార్లతో చెరువుకు నీరు



కైకలూరు: కలిదిండి మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ పరిధిలో తాగునీటి చెరువు నింపేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మోటార్లు ఏర్పాటుచేసి చెరువులోకి తాగునీరు పంపిస్తున్నట్లు సర్పంచ్ ఆల రాము, కార్యదర్శి నస్రీన్ బేగం తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా చెరువును పూర్తిగా నీటితో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రవేశాల కోసం ఇంటింటి సర్వేలు



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఒకటో తరగతిలో నూతన ప్రవేశాలకు ఇంటింటికీ తిరిగి విద్యార్థుల వివరాలు సేకరించారు. తల్లిదండ్రులతో మాట్లాడి అంగీకారం తీసుకుని ప్రవేశపత్రాలు అందజేస్తున్నారు. పెయ్యేరు, చిగురుకోట, సంఘర్షణపురం ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఉపాధ్యాయులు సోమవారం ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. అదేవిధంగా బడికి హాజరుకాని, డ్రాప్ అవుట్ విద్యార్థులకు సంబంధించి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రవేశాలు కల్పించారు.

మండవల్లి హైస్కూల్లో 30 మంది చేరిక



మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో కమిషనర్ ఆదేశాల మేరకు ఆరో తరగతిలో 30 మంది విద్యార్థులను చేర్చుకున్నట్లు హెచ్ఎం, ఉపాధ్యాయులు సోమవారం పేర్కొన్నారు. అయ్యవారిరుద్రవరం ఎంపీపీఎస్, అయ్యవారిరుద్రవరం హెచ్‌డబ్ల్యూ ఎంపీపీఎస్, తక్కెళ్లపాడు ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్వయంగా వచ్చి విద్యార్థులను చేర్పించినట్లు తెలిపారు.

విద్యుత్ కోతల వేళలు

కైకలూరు: ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజూ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ స్కీం ద్వారా మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మొక్కుబడిగా రహదారి మరమ్మతులు..!

తోట్లవల్లూరు–ఉయ్యూరు రోడ్డుకు రూ. 40 లక్షలతో పనులు



దెబ్బతిన్న కొత్త రోడ్డు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులు మొక్కుబడిగా జరిగాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు మరమ్మతు పనులను నామమాత్రంగా చేపట్టారనే ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. తోట్లవల్లూరు–ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. దీనికి సంబంధించి పనులను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జనవరి 21న ప్రారంభించారు. పనులు మందకొడిగా సాగి ఇటీవల పూర్తయ్యాయి. రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు జరపకపోగా, కొత్తగా నిర్మించిన రోడ్డు కూడా సరిగా వేయలేదనే విమర్శలున్నాయి. రెండు చోట్ల సుమారు 60 మీటర్ల పొడవునా కొత్తగా నిర్మించిన రోడ్డు కూడా దెబ్బతింది.

నామమాత్రంగా పనులు

రోడ్డు మరమ్మతు పనులు నామమాత్రంగా జరిగాయనే ఆరోపణలున్నాయి. టెండర్ నిబంధనల ప్రకారం నాలుగు కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు జరపాల్సి ఉంది. అయితే ఉయ్యూరు బస్టాండ్ నుంచి గరికపర్రు మలుపు వరకు అక్కడక్కడా గోతులను పూడ్చారు. మేరుగు సుబ్బారావు ఇటుక బట్టీల సమీపం నుంచి పెట్రోల్ బంక్ వరకు కేవలం 700 మీటర్ల పొడవున రోడ్డును నిర్మించారు. గరికపర్రు మలుపు నుంచి యాకమూరు వరకు, తోట్లవల్లూరు పెట్రోల్ బంక్ నుంచి కేఈబీ కెనాల్ వంతెన వరకు రోడ్డుకు మరమ్మతులు జరపాల్సి ఉంది.

ఎక్కడి గోతులు అక్కడే



అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

రోడ్డు అభివృద్ధి జరుగుతుందనే గ్రామస్తుల ఆశ ముణ్నాళ్ల ముచ్చటగానే మారింది. యాకమూరులో రోడ్డు చాలా వరకు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అలాగే తోట్లవల్లూరు పెట్రోల్ బంక్ నుంచి కేఈబీ కాలువ వంతెన వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. చాలా చోట్ల రోడ్డు గోతులమయంగా మారటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు



అధ్వానంగా ఉన్న తోట్లవల్లూరు–ఉయ్యూరు రోడ్డు అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. రోడ్డు కొంత మేరకే వేసి వదిలేయటం ఆశ్చర్యం కలిగిస్తోంది. కనకదుర్గమ్మ కాలనీ వద్ద పెట్రోల్ బంక్ నుంచి కేఈబీ కెనాల్ వంతెన వరకు రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.

– తాడికొండ సుధాకర్, తోట్లవల్లూరు

నిధులు చాలటం లేదు



రోడ్డు అభివృద్ధికి నిధులు చాలటం లేదు. రోడ్డు మరమ్మతులకు ఏడాదిన్నర క్రితం అప్పటి అంచనాల ప్రకారం నిధులు మంజూరయ్యాయి. సుమారు రెండు కిలోమీటర్ల వరకు మరమ్మతులు జరిగాయి. మిగిలిన రోడ్డు అభివృద్ధికి రూ.3.50 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి నివేదించాం.

– మల్లికార్జున, ఏఈఈ, ఆర్ అండ్ బీ, ఉయ్యూరు

పౌష్టికాహారంతో ఆరోగ్యం



అవురుపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కనుమూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



వడాలిలో జరిగిన సీమంతంలో పాల్గొన్న గర్భిణులు

గుడివాడ టౌన్: మహిళల ఆరోగ్యం బాగుండాలంటే పౌష్టికాహారంపై దృష్టిపెట్టాలని సీడీపీఓ విజయా ఫ్లారెన్స్ అన్నారు. సోమవారం స్థానిక 13వ వార్డులోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని మహిళలకు పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకించి గర్భిణులు పౌష్టికాహారం విషయంలో అలసత్వం వహించకూడదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె. నాగజ్యోతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పామర్రు: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ సత్యశ్రీ పేర్కొన్నారు. స్థానిక బాపూజీపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డకు రెండు ఏళ్లు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. పోషకాహారం గురించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ఏవిధంగా తయారు చేసుకోవాలో వివరించామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు విజయలక్ష్మి, ఎంఎస్‌కే స్వాతి, ఆశా వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, సాయినగర్ కార్యకర్త ఎస్ శ్రీదేవి పాల్గొన్నారు.

కనుమూరులో ..

కనుమూరు–11 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. తొలుత చిన్నారులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు ఎంఎస్‌కే సుధారాణి పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె ప్రసన్న, పీ పుష్పావతి పాల్గొన్నారు.

మొవ్వలో..

అవురుపూడి(మొవ్వ): మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అవురుపూడి కేంద్రం–1లో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పుణ్యవతి ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అవగాహనా ర్యాలీ ని గ్రామ వీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ వై.భాగ్యలక్ష్మి, కార్యకర్త నాగపుష్పావతి, సహాయకురాలు మోహిని పాల్గొన్నారు.

రక్తహీనత నివారించుకోవాలి

ముదినేపల్లి రూరల్: గర్భిణులు రక్తహీనతను నివారించుకుని ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనివ్వాలని ఐసీడీఎస్ వడాలి సెక్టర్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. మండలంలోని వడాలి సచివాలయంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు అధికంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగజ్యోతి, సుప్రభాత, విజయలక్ష్మి, జగదీశ్వరీ, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: ఆనందపురం అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో సోమవారం పోషణ్ పట్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీ కోసం'లో మూడు అర్జీలు

మొవ్వ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కే మస్తాన్ తెలిపారు. భూమి సర్వే, ఇంటి స్థలంకోసం, పంచాయతీ స్థలం స్వాధీనం కోసం మూడు దరఖాస్తుల అందినట్లు పేర్కొన్నారు.

రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

తోట్లవల్లూరు: రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈ నెల 30వ తేదీ లోపల ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలు అందాలంటే ఈకేవైసీ తప్పనిసరని ఆమె పేర్కొన్నారు. ఈకేవైసీ లబ్ధిదారుల వివరాలు ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, డీటీ, తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, వెంటనే చేయించుకోవాలని కోరారు.

రక్తదానం

గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య సోమవారం తెలిపారు. బేతవోలుకు చెందిన కృష్ణకుమారి రక్తహీనతతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో రక్తం అవసరం కాగా ట్రస్ట్ సభ్యుడు ఎల్. గోపయ్య స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు సీతయ్య తెలిపారు.

జూనియర్ కళాశాల్లో నూతన కోర్సులకు అనుమతి

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో 2025–26 విద్యాసంవత్సరం నుంచి నూతన కోర్సులకు అనుమతి లభించింది. ప్రస్తుతం ఈ కళాశాల్లో సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీసీ గ్రూపులున్నాయి. వీటితో పాటు ఈ ఏడాది నుంచి కొత్తగా బైపీసీ, ఎంబైపీసీ కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు ప్రిన్సిపాల్ ఓఎస్ఎన్ మూర్తి సోమవారం తెలిపారు. కొత్త గ్రూపుల్లో ఒక్కొక్క గ్రూపునకు 44మంది విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతి వచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు మండలంలోని పలు హైస్కూళ్లకు వెళ్లి కళాశాల్లో ప్రవేశపెట్టనున్న నూతన గ్రూపుల నుంచి ప్రచారం నిర్వహిస్తున్నారు. కొత్త గ్రూపులు ప్రవేశపెడితే కళాశాల్లో ల్యాబ్ సౌకర్యం ఏర్పాటుచేయడంతో పాటు బోటనీ, జువాలజీ అధ్యాపకులను నియమించేందుకు ఆస్కారం ఏర్పడింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ముదినేపల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరరావు తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గృహ,వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల్లో విద్యార్థులను చేర్పించండి

మొవ్వ: మూడు సంవత్సరాలుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులను చేర్పించి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి–2 కే శ్రీలక్ష్మి సూచించారు. క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సోమవారం కాలేజీకి సంబంధించిన ప్రత్యేకతను, సాధించిన ఉత్తమ ఫలితాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి సుధాకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొవ్వ హెచ్ఎం సూర్యదేవర శ్రీదేవి, కూచిపూడి హైస్కూల్ ఉపాధ్యాయులు బండారు మాణిక్యాలరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించండి


వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేతలు



కొత్తపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు

కొత్తపల్లి(ఘంటసాల): ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడే శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బృందం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో చేసిన ఎనిమిది వారాల పని దినాలకు వేతనాలు రాలేదని కార్మికులు చెప్పారన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం చేసిన పనికి 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాల్సి ఉండగా నెలలు గడుస్తున్న ఎనిమిది వారాల నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో ఉపాధి కార్మికులకు చెల్లించాలన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని, రోజువారి వేతనం రూ.600లు పెంచాలని డిమాండ్ చేశారు. మా పరిశీలనలోకి వచ్చిన సమస్యలను గుర్తించి మే 5న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యుడు మేడంకి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కానుకొల్లులో ఉత్తమ రైతులకు సన్మానం

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల ఇన్‌చార్జి నాగవిజయ ఆధ్వర్యంలో ప్రకృతి అవగాహన గ్రామసభ సోమవారం నిర్వహించారు. ట్రైనింగ్ ఏఎఫ్ఏ మధుబాబు ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకతను వివరించారు. మాస్టర్ ట్రైనర్ అగస్టిన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వంగడాల సాగు, పచ్చిరొట్ట పైర్ల పెంపకం, ఉపయోగాలు వివరించారు. మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. విత్తన గుళికలు తయారీ విధానం, ఉపయోగాలను డీఎంఎంటీ నారాయణ తెలియజేశారు. అనంతరం ఉత్తమ రైతులు జోసఫ్ తంబి, రాజశేఖర్, పి.శ్రీనివాస్, మరడాని బాలాజీలను సన్మానించారు. ఐసీఆర్పీలు నళిని, జగన్, నాగవాణి, రామారావు, రమేష్, వీఓఏ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

టిడ్కో కాలనీ రుణాలు రద్దు చేయండి



దీక్ష చేస్తున్న టిడ్కో కాలనీ లబ్ధిదారులు

గుడివాడ టౌన్: ఎన్నికల సమయంలో టిడ్కో కాలనీ లబ్ధిదారులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం కాలనీలోని వైఎస్సార్ విగ్రహం వద్ద లబ్ధిదారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం టిడ్కో కాలనీ లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తూ తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనికి ప్రతిగా కూటమి నాయకులు సైతం అధికారంలోకి వచ్చిన వెంటనే రుణాల మాఫీ కోసం రూ. 250 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేసి లబ్ధిదారులను రుణవిముక్తులను చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వారి హామీలను నమ్మి టీడీపీ ప్రజా ప్రతినిధిని గెలిపిస్తే వారు కనీసం ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకపోవడం దుర్మార్గం అన్నారు. తక్షణమే రుణమాఫీ, మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలు తీర్చేందుకు రూ. 250 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 10 రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ, ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు, ఆర్. శివరామ్ ప్రసాద్, సహాయ కార్యదర్శులు నాగవాణి, ఎస్. రంగమ్మ, మూడెడ్ల ఉమ, అప్పల నాయుడు, హైమావతి, ఫ్లారి, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏఎన్నార్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: ఆల్ ఇండియా సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో విజయవాడ శ్రీకృష్ణవేణి డిగ్రీ కళాశాల్లో జరిగిన సాఫ్ట్‌బాల్ పురుషుల పోటీల్లో తమ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభను కనపరచిన జి. బార్గవ్, టి. ప్రభుకుమార్ రాజు, జి. కోటేశ్వరరావు, డి. శివశంకర్ ఆల్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు కృష్ణా యూనివర్సిటీ తరఫున పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఫిజికల్ డైరక్టర్ వీర్ల గోపి పాల్గొన్నారు

రామానుజమ్మ సేవలు మరువలేనివి



రామానుజమ్మను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

పామర్రు: ఆఫీస్ సబార్డినేట్(ఓఎస్)గా 37 ఏళ్ల విధులు నిర్వహించి మన్ననలు పొందిన రామానుజమ్మ సేవలు మరువలేనివని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ)పెదపారుపూడి–పామర్రు యూనిట్ అధ్యక్షుడు ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్లో ఉద్యోగ విరమణ పొందిన రావులపాటి రామానుజమ్మను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామానుజమ్మ ఓఎస్‌గా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, స్థానిక జెడ్పీ హైస్కూల్లో విధులు నిర్వహించి, అధికారుల ప్రసంశలు పొందారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ కార్యదర్శి విజయకుమార్, కోశాధికారి శివ నాగమణి, ఉపాధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్, చంద్రశేఖర్, కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి చెరువుల్లో నీటిని నింపండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ప్రతి గ్రామ తాగునీటి చెరువులో కాల్వల ద్వారా వచ్చిన నీటిని నింపాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పోలీసు అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్, సెక్రటరీలు, నీటి సంఘం నాయకులు పూర్తి స్థాయిలో చెరువుల్లో నీటిని నింపే బాధ్యతను తీసుకోవాలన్నారు. డ్రెయిన్లు, పంట కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. పంట కాలువలు, డ్రెయిన్లలో చెత్త, జంతు కళేబరాలను వేస్తున్న వారిని గుర్తించి పోలీసులు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, డీఎల్‌పీఓ చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈ శిరీషా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, ఎంపీడీఓ ఆర్. ఫణీంద్ర, రూరల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ, డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఫలాలు అందిస్తున్న కిచెన్ గార్డెన్



కిచెన్ గార్డెన్లో పండించిన పైనాపిల్ చూపుతున్న ఉపాధ్యాయుడు

ముదినేపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్లు విద్యార్థులకు ఫలాలందిస్తున్నాయి. మండలంలోని పెయ్యేరు పాఠశాల్లో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌లో ప్రధానోపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు రెండు పైనాపిల్ మొక్కలను నాటగా అవి నేడు ఫలాలను అందించాయి. మన ప్రాంతంలో పైనాపిల్ మొక్కల ఎదుగుదలకు వాతావరణం పెద్దగా అనుకూలించదు. అయినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో ఫలసాయం పొందగలిగినట్లు హెచ్ఎం తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా మట్టితో ఇక్కట్లు



నిభానుపూడి (పామర్రు): పామర్రు మండలం నిభానుపూడిలో పీఎం ఏజెవై పథకం కింద డ్రెయినేజీ పనులు చేపట్టారు. ఈ పనుల వలన ఒక రోడ్డులో డ్రెయినేజీ పనుల మట్టిని అడ్డంగా పోయటంతో ఆ రోడ్డులో ఉన్న ప్రజలు రాక పోకలకు ఇబ్బందులుపడుతున్నారు. కనీసం నడక దారికి కూడా సరైన అవకాశం లేదని, వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిలోని ప్రజలకు ఒక కల్వర్టుని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అమెరికాతో ఒప్పందం రైతులకు నష్టం

బంటుమిల్లి: భారతీయ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంతో చేసుకునే ఒప్పందం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ఆరోపించారు. దేశ పర్యటనలో భాగంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసుకునే ఆర్థిక ఒప్పందాలు మంచివికావన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యం, మినుములు, ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రాక నష్టపోతున్నారని నాగేశ్వరరావు తెలిపారు. ఆర్థిక ఒప్పందాలకు నిరసనగా సోమవారం అంబేడ్కర్ సెంటరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల రైతు సంఘ సభ్యులు, కూలీలు పాల్గొన్నారు.